ప్రజాశక్తి

బుధవారం 20 నవంబర్ 2024 | 8 పేజీలు

గుంటూరు | పల్నాడు

విస్తరిస్తున్న పొగాకు సాగు

ధర పెరుగుదలతో రైతుల్లో ఆసక్తి - తగ్గిన వరి, పత్తి, మిర్చి పంటలు

ప్రజాశక్తి-గుంటూరు

వరి, మిర్చి, పత్తి పంటలకు పేరుగాంచిన గుంటూరు జిల్లాలో పొగాకు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. సంప్రదాయ పంటలలో నష్టాలు, పొగాకు పంటలకు అంతర్జాతీయంగా డిమాండ్, మంచి ధర ఉండటంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. టుబాకో బోర్డు కేంద్ర కార్యాలయం గుంటూరులో ఉన్నా గుంటూరులో పొగాకు సాగు ఇక్కడ పెద్దగా లేదు. రాష్ట్రంలో ప్రకాశం జిల్లాలోనే అధికంగా సాగువుతుంది. ఇప్పుడు గుంటూరులో కూడా క్రమంగా పెరుగుతోంది. పొగాకు రబీ పంటగా వేస్తారు. రబీ ప్రారంభంలోనే పొగాకు సాధారణ విస్తీర్ణంలో సగంపైగా పంట వేశారు. కాగా ప్రభుత్వ నియంత్రణ ఉన్న పంట అయిన పొగాకు సాగు పెరగటం గమనార్హం.

గుంటూరు జిల్లాలో ఈ ఏడాది పొగాకు సాధారణ విస్తీర్ణం 2310 ఎకరాలు. ప్రస్తుత రబీసీజన్ ప్రారంభమై మూడు వారాలు గడిచింది. ఇప్పటి వరకూ 1455 ఎకరాల్లో పంటలు వేశారు. గతేడాది సాధారణ విస్తీర్ణం దాదాపు 2 వేల ఎకరాలు కాగా, 4320 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 10 నుండి 12 వేల ఎకరాలకుపైగా పొగాకు సాగువుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గుంటూరు పశ్చిమ మండలంలో 37 ఎకరాలు, ప్రత్తిపాడు మండలంలో 160 ఎకరాలు, పెదనందిపాడు 707 ఎకరాలు, ఫిరంగిపురం 330 ఎకరాలు, కాకుమాను 160 ఎకరాలు, తాడికొండ 25 ఎకరాల్లో, కాకాని మండలంలో 4 ఎకరాలలో పొగాకు పంట వేశారు.

ప్రతి ఏటా వరి, మిర్చి, పత్తిలో అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ళు, కల్తీల పురుగు మందులు, విత్తనాల సమస్యతో రైతులు పెద్ద ఎత్తున నష్టాలు చవి చూస్తున్నారు. సంప్రదాయ పంటలతో పోలిస్తే పొగాకు సాగుకు పెట్టుబడి కూడా తక్కువ అవుతుంది. ఎకరాకు రూ.40 వేల వరకు ఖర్చు ఉంటుంది. అంతర్జాతీయంగా డిమాండ్ ఉండటం, ఈ ఏడాది పొగాకు పంటకు రికార్డు ధర రావటంతో రైతులు ఆ పంటవైపు దృష్టి సారించారు. ఒక్కో ఎకరాకు 10 నుండి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కొన్నిచోట్ల 18 క్వింటాళ్లు కూడా వస్తుంది. అయితే జిల్లాలో అంతర్జాతీయంగా ఎగుమతికి ఉద్దేశించిన ఎఫ్‌సివి పొగాకు సాగు లేదు. వైట్ బెర్లీ, బ్లాక్ బెర్లీ రకాలే వేస్తున్నారు. వీటిని దేశీయంగా వినియోగిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో పొగాకు కొనుగోళ్లు జరిగాయి. కిలోకు రూ.288లు అత్యధిక సగటు ధర పొందారని టుబాకో బోర్డు ఇటీవల ప్రకటించింది. అంతర్జాతీయంగా ఎఫ్‌సివి పొగాకుకు మంచి డిమాండ్ ఉండటంతో స్క్రాప్‌తో సహా కొనుగోళ్లు జరిగాయి. ఈ నేపథ్యంలో రైతులు పొగాకు సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న మల్లీశ్వరి

దాడులపై అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం అంగన్వాడీ కార్యకర్త బుజ్జి, ఆమె భర్తపై టిడిపి కార్యకర్తల దాడి, దూషణలను ఖండిస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.మల్లేశ్వరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు తమ సమస్యల మీద 42 రోజులు పాటు సమ్మె చేస్తే సమ్మె చేసిన సందర్భంలో శిబిరాల వద్దకు వచ్చిన టిడిపి నాయకులు మద్దతు తెలిపారని, అంగన్వాడీలకు రక్షణగా ఉంటామన్న నాయకులే ఇప్పుడు అంగన్వాడీలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. భౌతిక దాడులు, రాజకీయ వేధింపులను ఆపకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు మాట్లాడుతూ కూటమి పాలనలో అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, యానిమేటర్లు, ఇతర చిరుద్యోగులు, స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు తీవ్రమయ్యాయని, రాజీనామా ఒత్తిళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం, చట్టం గురించి మాట్లాడిన వారు అధికారంలోకి వచ్చిన తర్వాత కనిపించడం లేదని అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని పలు మండలాల్లో వేధింపులు పెరిగాయని, వీటి నియంత్రణకు స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ పుల్లారావు, యూనియన్ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

23న పట్టభద్రుల ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా

రాజకీయ పార్టీలతో సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి ఈనెల 23న ముసాయిదా జాబితా విడుదల చేస్తామని, వచ్చేనెల 9 వరకూ జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీలతో కలెక్టరేట్‌లో మంగళశారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 30 నుండి నవంబర్ 06 వరకు పట్టభద్రుల శాసనమండలి ఓటుకు దరఖాస్తు చేసుకున్న

2లో

26న గుంటూరులో ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయండి

5లో

వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు మానుకోవాలి

ప్రజాశక్తి - వినుకొండ : మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శావల్యాపురం మండలం పోయకల్లు, మత్తుకుమల్లిలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు కోరపాటు సుబ్బాయమ్మ, చిన్న జన్నమ్మను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాజకీయ వేధింపులలో జరుగుతున్న ఈ చర్యలను అడ్డుకోవాలని ఎంఇఒకు మంగళవారం సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్లుతో కలిసి వినతిపత్రం అందజేశారు. సుబ్బయ్యమ్మను తొలగించేందుకు నూతనంగా ఎన్నికైన తల్లిదండ్రుల కమిటీతో స్థానిక నాయకులు ఫిర్యాదులు చేయిస్తున్నారని చెప్పారు. వీటిపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

కొత్త మెడికల్ కాలేజీలపై ప్రభుత్వం కుట్ర

కాలేజీల భూములపై కూటమి నేతల కన్ను : మాజీ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు సిఎంగా ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక రూపొందిస్తే కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి విడదల రజిని ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ కోసమే ఈ ఏడాది అడ్మిషన్లు వద్దన్నారని, కొత్త మెడికల్ కాలేజీల భూములపై కూటమి నాయకులు కన్నేసి విద్యార్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతున్నారని విమర్శించారు. కష్టపడి సాధించిన అనుమతులు రద్దు చేసిన దుర్మార్గ ప్రభుత్వం దేశంలో ఎక్కడా ఉండదన్నారు. 5 నెలల్లోనే వైద్యారోగ్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణాలపై అసెంబ్లీలో మంత్రి సత్యకుమార్ అసత్యాలు ప్రచారం చేశారని, కొత్త మెడికల్ కాలేజీలు మొదలైతే ఆ క్రెడిట్ మొత్తం జగన్‌కు వస్తుందన్న ఆలోచనతో మంత్రి ఈ విమర్శలు చేస్తున్నారని అన్నారు. హాస్టళ్లు కట్టలేదు కాబట్టి మెడికల్ కాలేజీలకు పర్మిషన్ రాలేదని మండలిలో మంత్రి తప్పుడు ప్రకటన చేశారన్నారు. నిజానికి పులివెందుల మెడికల్ కాలేజీలో ఈ ఏడాది కొత్తగా 50 సీట్లకు అనుమతి ఇస్తూ జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) ప్రభుత్వానికి లేఖ రాస్తే తాము అవి నిర్వహించలేమంటూ కూటమి ప్రభుత్వం చెప్పిందన్నారు. ఆగస్టు 16న పులివెందుల మెడికల్ కాలేజీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తూ ఎన్ఎంసి నిర్ణయం తీసుకుందన్నారు.

నరసరావుపేట సబ్ జైలులో వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలకు పరామర్శ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలకు కూటమి ప్రభుత్వ వేధింపులు అధికమయ్యాయని కార్యకర్తలు

2లో

నరసరావుపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని

జాతీయస్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం

ప్రజాశక్తి - దుర్గి

ధర్మవరంలోని శ్రీ హరిహర బాల నాగేంద్ర స్వామి తిరుణాల సందర్భంగా మంగళవారం జాతీయస్థాయిలో ఎడ్ల బండలాగుడు పోటీలను మంగళవారం ప్రముఖ మిర్చి వ్యాపారవేత్త అక్కిశెట్టి బాబు ప్రారంభించారు. సాయంత్రం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు వీక్షించారు. అనంతరం ఎడ్ల జతల యజమానులను జ్ఞాపికలు అందజేశారు.

ఉండవల్లి శ్రీదేవిని సత్కరిస్తున్న మానుకొండ జాహ్నవి

పలు కార్పొరేషన్ల చైర్మన్‌లకు జాహ్నవి సత్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పలువురు కార్పొరేషన్ చైర్మన్‌లను టిడిపి రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి, నరసరావుపేట నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు మానుకొండ జాహ్నవి మంగళవారం సత్కరించారు. రాష్ట్ర మాదిగ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, రాష్ట్ర లెదర్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావును కలిసి సత్కరించారు.

కోటప్పకొండపైకి రోప్ వేకు నిధులివ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : కోటప్పకొండ పైన త్రికోటేశ్వరస్వామి దేవాలయం కొండ పైకి వెళ్లేందుకు రోప్ వే వెయ్యాలని డాక్టర్ కోడెల శివప్రసాదరావు, పల్నాడు జిల్లా ప్రజల చిరకాల కలని అందుకు రూ.50 నుంచి రూ.100 కోట్ల నిధులు అవసమవుతాయని దీనిని దష్టిలో పెట్టుకొని దేవదాయ శాఖ నిధులు మంజూరు చెయ్యాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న మహాశివరాత్రి పండుగ జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర పండుగ అయినా కోటప్పకొండ తిరుణాళ్ల నాటికి రోడ్లను బాగు చేసుకోవాలన్నారు. తిరునాళ్లను ఘనంగా నిర్వహించుకునేందుకు దేవదాయ శాఖ నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

26న కార్మిక, రైతు ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు : అఖిల భారత కార్మిక సంఘాలు, రైతు సంఘాలు పిలుపు మేరకు నవంబర్ 26న గుంటూరులో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని సిఐటియు గుంటూరు తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. మంగళవారం నగరంలోని సివిల్ సప్లైస్ ముఠా కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఠా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టం చేయాలని, కనీస వేతన బోర్డులో వేతనాలు సవరించాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు, పంటలకు మద్దతు ధరలు తదితర డిమాండ్లతో జరిగే ర్యాలీలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. గుంటూరులోని అరండల్‌పేట నాలుగో లైన్ నుండి గాంధీ పార్క్ వరకు ర్యాలీ, తర్వాత బహిరంగసభని చెప్పారు. కార్యక్రమంలో ముఠామేస్త్రి కోటయ్య, కొండలు, ఇర్మియ, కృష్ణ పాల్గొన్నారు .

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వచ్చే నెల 31 నాటికి పల్నాడు జిల్లాలో పేదలకు మంజూరైన ఇళ్లలో 5,650 ఇళ్లను నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది పూర్తయ్యేనాటికి 15,800 ఇళ్లకు స్టేజ్ కన్వర్షన్ చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు వారం వారం లక్ష్యాలు నిర్దేశించుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. మంగళవారం మధ్యాహ్నం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం కలెక్టరేట్ లోని జాషువా సమావేశ మందిరంలో హౌసింగ్, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, జియో టాగింగ్, పోషన్ వాటిక, ఎన్పీసీఐ మ్యాపింగ్, ఉపాధి హామీ వేతనాల చెల్లింపులపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ ద్వారా ఎక్కువ మంది కూలీలకు ఉపాధి, పూర్తి మొత్తంలో వేతనాలు అందించేలా చూడాలన్నారు. ఉపాధి హామీలో అవకతవకలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధి హామీ కూలి చెల్లింపు ఘటనలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మండలాల్లో పరిస్థితులను ఎంపీడిఓలు చక్కదిద్దకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

'మిట్టపల్లి స్పిన్నర్స్' విజ్ఞాన విహార యాత్రకు ఎన్ఇసి విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థుల విజ్ఞాన యాత్రలో భాగంగా నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ సంవత్సరం మెకానికల్, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం విద్యార్థులు నరసరావుపేట మండలంలోని యలమంద గ్రామ సమీపంలో ఉన్న 'మిట్టపల్లి స్పిన్నర్స్ లిమిటెడ్'ను మంగళవారం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ పిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్ మాట్లాడుతూ మిట్టపల్లి స్పిన్నర్స్‌లో దుస్తుల తయారీకి అవసరమైన నాణ్యమైన నూలును వీలైనంత తక్కువ ధరకే తయారు చేస్తుందన్నారు. వివిధ రకాలైన నూలు దేశ విదేశాలకి, వారి అంచనాలకు తగ్గట్లుగా తయారు చేసి సరఫరా చేస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూలును తాయారు చేసే యంత్రాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు మిక్సింగ్, బ్లో రూమ్, కార్డింగ్, లాప్ ఫార్మర్, కూమ్బింగ్, స్పిన్నింగ్, ఆటోకానెర్ తదితర యంత్రాలను నూలు ప్రాసెస్ విధానాల గురించి తెలుసుకున్నారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి,కార్యదర్శి మిట్టపల్లి రమేష్ లు మాట్లాడుతూ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో పరిశ్రమలపై అవగాహన కల్పించేందుకు ఈ సందర్శనలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. విద్యార్థులకు పరిశ్రమలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి విద్యార్థుల యొక్క మేధో సంపత్తిని పెంపొందిస్తాయని, తద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ప్రతి సెమిస్టర్‌లోనూ కనీసం ఒక పరిశ్రమను విద్యార్థులందరూ తప్పనిసరిగా సందర్శించేలా కార్యాచరణ రూపొందించామన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశ్రమను సందర్శించడం ద్వారా కొత్త అంశాలను క్షుణ్ణంగా తెలుసుకున్నామని విద్యార్థులు తెలిపారు. సందర్శనను మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.వెంకట శివ, ఐటి,ఎఐ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.జాన్సీవజ్రం, విజ్ఞాన విహార యాత్రల సమన్వయకర్త డాక్టర్ పి.సురేష్‌బాబు పర్యవేక్షించారు.

24న ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ మంతెన సుబ్బరాజు ఆధ్వర్యంలో ఈనెల 24న ఆదివారం నరసరావుపేట పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా మహిళా కబడ్డీ జట్టును ఎంపిక ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో డిసెంబర్ 5 నుండి 8 వరకు జరిగే 71వ అంతర జిల్లాల మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9502925925 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాలికల చదువే సమాజాభ్యున్నతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బాలికలు చదువు కోవటం వల్ల సమాజం అభ్యున్నతి సాధిస్తుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. బాలల హక్కల వారోత్సవాల సందర్భంగా మహిళాఅభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఐక్యరాజ్యసమితి 1989 నవంబర్ 20 అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడికను ఆమోదించిందని, జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్యపు హక్కు ఇందులో ప్రధానమైనవని వివరించారు. బాల్య వివాహాలు జీవితాలను అంధకారం చేస్తాయన్నారు. బాలల హక్కులకు భంగం కలిగిస్తే ఎంతటి వారిపైన అయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. విలువలతో కూడిన విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని విద్యార్థినులకు సూచించారు. హక్కులు, చట్టాలపై వివరించారు. ప్రతి గ్రామంలో గ్రామస్థాయిలో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. పల్నాడు జిల్లాను బాల కార్మికులు లేని జిల్లాగా స్నేహపూరిత జిల్లాగా నిర్మించుకుందామని ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ శైలజ, హెల్ప్ ఫౌండేషన్ కె.బుల్లిబాబు, బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

నరసరావుపేట సబ్ జైలులో వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలకు పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

ఎవరూ అధైర్యప డొద్దని పార్టీ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి చిలకలూరిపేట వైసిపి సమన్వయ కర్త విడదల రజిని అన్నారు. అక్రమ కేసులో అరెస్ట్ అయి నరసరావుపేట సబ్ జైలులో ఉన్న నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామ సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మీ భర్త కోటిరెడ్డిని, సోషల్ మీడియా కార్యకర్తలను మంగళవారం ఆమె పరామర్శించారు. అక్రమ నిర్భందాలు, అరెస్టులపై స్పందించారు. ఈ సందర్భంగా సబ్ జైలు వద్ద మీడియాతో మాట్లాడుతు కార్యకర్తలకు అండగా నిలిచేందుకు జిల్లాల వారిగా న్యాయ బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారి కుటుంబాలకు పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. వైసిపి కార్యకర్తలపై నాయకులపై అక్రమ కేసులు తగదని సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి కార్యకర్తలు, నాయకులే లక్ష్యంగా అక్రమ కేసులు పెట్టి జైళ్లకు తరలిస్తున్నారని, ఈ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా అనే అనుమానం కలుగుతుందన్నారు. తమ గ్రామంలో సచివాలయానికి ఎంపీడీఓ వస్తే అక్కడ ఉన్న సమస్యల గురించి చెప్పేందుకు వచ్చిన 75 ఏళ్ల వయసున్న కోటిరెడ్డిపై వివిధ సెక్షన్లు పెట్టి జైలుకు పంపారని ఆరోపించారు. వైసిపి నాయకులు అధికారులను కలిసి సమస్యలు విన్నవించే స్వేచ్ఛ లేదా అని ప్రశ్నించారు. కూటమి నాయకులు, అధికారులు ఆత్మ విమర్శ చేసుకోవాలని ఒక నాయకుడు ఫోన్ చేసి ఫలానా వ్యక్తిపై కేసు పెట్టమని చెప్పగానే రకరకాల సెక్షన్లు పెట్టి అధికారులు అరెస్టులు చేస్తున్నారన్నారు. ఎప్పుడు ఒకే ప్రభుత్వం శాశ్వతంగా ఉండదని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని చెప్పి వారిని మానసికంగా హింసించి వారికి, వారి కుటుంబాలకు తీవ్ర మనోవేదనకు గురి చేస్తు న్నారన్నారు. వైసిపి సోషల్ మీడియా బలంగా ఉందని దీనిని పూర్తిగా బలహీనం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఇది ఒక చెడు సాంప్రదాయానికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలను ఇచ్చిందని, ఆ హామీలను నెరవేస్తుందన్న నమ్మకం ప్రజలకు లేదన్నారు. ఎటువంటి సందర్భంలో అయినా ఎటువంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొంటామని కలిసికట్టుగా పోరాడుతామన్నారు.

23న పట్టభద్రుల ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా

(మొదటి పేజీ తరువాయి)

వారికి నవంబర్ 20వ తేదీన డ్రాఫ్ట్ ఓటరు జాబితాను 23న ప్రచురిస్తామన్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 2,83,100 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 48,900 మంది మొత్తం 3 లక్షల 32 వేల మంది దరఖాస్తు చేస్తుకున్నారన్నారు. ఇందులో 80 శాతం దరఖాస్తులు పరిశీలన పూర్తి చేశామని, మిగిలిన 20 శాతం దరఖాస్తులను 20వ తేదీ సాయంత్రం నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. నవంబర్ 23 నుండి డిసెంబర్ 9వ తేది వరకు డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబర్ 25 వ తేది నాటికి పరిష్కరించి, డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా ప్రచురింస్తామన్నారు. 2019 ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో 2,48,799 మంది ఓటర్లకుగాను 362 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, 2025 ఎన్నికలకు 3 లక్షల 32 వేల మంది ఓటర్లకు ఆరు జిల్లాల్లో 421 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించామని తెలిపారు. డిసెంబర్ 30 నాటికి తుది ఓటరు జాబితా నాటికి ఓటరు జాబితాను అనుసరించి పోలింగ్ స్టేషన్ల సంఖ్య మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 900 మంది ఓటర్లు ఓటు వేసే అవకాశం వుందన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఖాజావలి, ఆప్ నుండి డాక్టర్ టి.సేవాకుమార్, బిఎస్‌పి నుండి సిహెచ్.వాసు, బిజెపి నుండి పాండురంగ విఠల్ , సిపిఎం నుండి వై.కష్ణకాంత్, కాంగ్రెస్ ప్రతినిధి బి.సునీల్‌కుమార్, టిడిపి నుండి కె.శివరామయ్య పాల్గొన్నారు.

సాంస్కృతిక వికాసంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-గుంటూరు : ఆంధ్రప్రదేశ్‌లో సాంస్కృతిక వికా సాన్ని పెంపొందించాలని రాష్ట్ర మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి గుంటూరు లోని అన్నదాన సమాజంలో నవ్యాంధ్ర చైతన్య సదస్సుతోపాటు ఘంటశాల సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ అన్నదాన సమాజం సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చెందటం హర్షణీయమన్నారు. అమరావతి పునర్నిర్మాణం, పోలవరం ప్రాజెక్టును, ఇతర నీటిపారుదల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ త్వరత గతిన పురోగమిస్తుందన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం మూడు ముక్కల ఆటతో అమరావతిని విధ్వంసం చేసిందన్నారు. అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అట్టడుగు స్థాయిలో ఉందని, ప్రభుత్వ యూనివర్సిటీలన్నీ పతనావస్థకు చేరుకున్నాయన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, ప్రాంతీయ అసమానతలను తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నవ్యాంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతిలో ఘంటసాల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఘంటసాల మ్యూజియంను నిర్మించాలని, కృష్ణానది ఇరువైపుల ట్యాంక్ బండ్ నిర్మించి, తెలుగుజాతి మహ నీయులతో విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమం లో అన్నదాన సమాజ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆహ్వాన సంఘ కన్వీనర్ మిరియాల ప్రసాద్‌రావు, బి.బాలస్వామి ప్రసంగించారు.

మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

GENERAL NOTICE

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) :: MANGALAGIRI

I.P No: 31 /2024

BETWEEN :

Panthagani Ramesh, S/o.Dasu, R/o. Atmakuru (Vil), Mangalagiri(Md), Guntur Dist. ....Petitioner

and

1)Kunderla Nagaraju, S/o.Nageswara Rao, Mangalagiri, 2)Batthula Nagendramma Sibiram, Mangalagiri, 3)Ankem Sambasiva Rao, Atmakuru, 4) Komma Maniraju, S/o.Basavaiah, Atmakuru, 5) Mallika Chowdary, Vijayawada, 6)Shaik Sharif, Atmakuru, 7)T.Lakshmi, Mangalagiri, 8)Vinjumuri Poornachandra Rao, Z.P.H.School, Penumaka, 9) Jaladi Prem Chand, Atmakuru, 10)Venkat 11)M.Padamavathi, W/o. Narasimham,Vijayawada, 12)Kaja Venkateswara Rao, Atmakuru. ....Respondents

పై నెంబరు ఐ.పి.లోని పిటీషనరు తనను ఇన్ సాల్వెంట్‌గా డిక్లేర్‌చేయమని కొరుచూ దాఖలుచేసిన పిటీషనులో ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వగైరాలు ఉన్నచో తెలుపుకొనవలసినదిగా కోరుచూ శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం **ది.22-11-2024**కి వాయిదావేసినారు. కావున ఆక్షేపణలు ఉన్న వారు వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా తేది :22.11.2024

సిహెచ్. రత్న కిషోర్, పిటీషనరు తరపు అడ్వకేట్, మంగళగిరి, సెల్:8247886914

జనరల్ నోటీసు

మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P No. 53 / 2024

బిట్వీన్:

రాయల కేశవ ...పిటీషనరు

వర్సెస్

1.పులుసు వెంకట నర్సిరెడ్డి, 2.ధర్మవరపు సురేష్,3.చిలంచెర్ల వెంకటేశ్వర్లు,4.దవళేశ్వరపు శ్రీనివాసచారి,5.ముడిశెట్టి శ్రీనివాస రావు,6.జక్కా రాంబాబు,7.రాయల రామాంజనేయులు,8.ఉప్పు దుర్గారావు,9.జక్కా శ్రీనివాసరావు,10.రంగిశెట్టి శ్రీధర్ బాబు, 11. కామిశెట్టి అనిల్ కుమార్,12. నక్షత్రపు సత్యనారాయణ,13. నక్షత్రపు వెంకటేశ్వర్లు,14. నక్షత్రపు కిషోర్,15. నక్షత్రపు వెంకట నరేష్, 16.షేక్ నాగుల్ మీరా,17.దొండేటి రామసింహారెడ్డి,18. బొమ్మిరెడ్డి రామచంద్రా రెడ్డి,19.పలుచూరి రమేష్,20.పల్లెర్ల చిన హనిమిరెడ్డి,21.వీడెల లక్ష్మినారాయణ,22.చదలవాడ వెంకటేశ్వర్లు,23.వాలె కోటేశ్వరరావు,24.సయ్యద్ నాన్సాహెబ్ జరీనా, 25.పులివర్తి శ్రీనివాస్,26.షేక్ జమ్మెలా,27.సాగి శివ బాస్కర్ రావు, 28.బావనారి సుబ్బారావు,29.చుండూరు నాగేశ్వరరావు, 30.ఆరికట్ల విజయ లక్ష్మి,31.బోలినేడి పార్వతి,32.ఆకుల లక్ష్మి నారాయణ,33.పెండ్లి శ్రీనివాసరావు,34.చిలంకూరి శ్రీనివాస రెడ్డి,35.వెన్నపూసల శ్రీనివాసరావు,36.వుల్లి ప్రకాశరావు,37. పంతంగి రామారావు,38.చక్కా రాజేంద్ర,39.గోగుల అంజిరెడ్డి, 40.బండ్రెడ్డి మణికుమార్,41.మిట్ట రామకృష్ణ,42.యతిరాజు మురళి కృష్ణ,43.యతిరాజు సాంబయ్య,44.గాజుల వెంకట్ అనాథ గణేష్, 45.గంగవరపు ఆంజనేయులు,46.పరిటాల శేఖర్, 47.షేక్ అమర వలి,48.నందివెలుగు ఈశ్వర రెడ్డి, 49. షేక్ సతార్,50.మారంరెడ్డి సురేష్ రెడ్డి,51.పిన్నెల్లి కృష్ణా రెడ్డి, 52.బావనారి రాంమోహన్ రావు,53.పందిరి శ్రీమన్నారాయణ, 54.నక్షత్రపు చంద్రశేఖర్,55.పలుచూరి బ్రహ్మేశ్వరరావు,56. బొగ్గవరపు వెంకట సూర్య పుల్లారావు,57.బత్తుల ఏడుకొండలు, 58.షేక్ రెహమాన్, 59.దేవకి వెంకట శేషగిరిరావు,60. ది అఫిషియల్ రిసీవర్, గుంటూరు. **...రెస్పాండెంట్లు**

పై నెంబర్ ఐ.పి. పిటేషన్‌లో శ్రీ కోర్టువారు రెస్పాండెంట్స్‌కు నోటీసులు ఆర్డరువేసియున్నారు. సదరు వాయిదా **ది.05.12.2024**న అయివున్నది. సదరు వాయిదా రోజు **ఉ॥గం.10.30 ని.**లకు స్వయంగా గానీ లేక లాయరు గారి ద్వారా గానీ కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసియున్నది. లేని ఎడల పరోక్ష మందు తీర్మాణించబడును.

కావూరి రామకృష్ణ

న్యాయవాది, గురజాల. సెల్ : 9849144606

IN THE COURT OF THE HON'BLE II ADDL.DISTRICT JUDGE AT :: SANGAREDDY

IA NO. 214 OF 2022

IN

O.S.No. 186 OF 2017

Between:-

Smt.Hanisanpally Nirmal. ...Petitioner / Plaintiff.

AND

Sri.Chinnagari Ravinder Reddy &others. ...Respondents / Defendants.

1. Paritala Anil Kumar S/o.Ram Mohan Rao, Age:34 years, Occ: Pvt. Employee, R/o.H.No.13-2-170/3, 13 th Ward, Sai Baba Temple, Macherla, Guntur District. R-48.

WHERE AS the Petitioner / Plaintiff has filed above Petition in IA No.214 of 2022 to implead you (mentioned the above) as the defendant in the above suit in OS No.186 of 2017, which is pending before the Hon'ble II Addl. District Judge, at Sangareddy, Telangana. The said Petition is posted on dated:29-11-2024 for your appearance. You are hereby required to appear in the Court on that day at 10.30 A.M. either in person or Pleader, failing which the matter will be decided as per law.

// BY ORDER OF THE COURT//

M. ANTHAIAH,
Advocate,
Sangareddy Town & District.
Cell: 9032815639 / 9490184879.

COURT NOTICE

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISON), TENALI

A.S. No. 235/2024

Between:

Majeti Srinivasa Rao ... Appellant

Vs

Tummala Dilip Chakravarthi.... Respondent

To,

Tummala Dilip Chakravarthi, S/o Harnadha Babu, Plot No. 202, Mamata residency, Lenin Street, Gandhi Nagar, Tenali.

పై నెంబరు అప్పీల్ నందు కోర్టుద్వారా, పోస్టల్ ద్వారా మీకు అనేక పర్యాయములు నోటీసులు పంపినను కావలయునని తీసుకొనక కాలయాపన చేయుచున్న కారణంగా శ్రీ కోర్టువారు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా పేపరు ప్రచురణ ద్వారా మీ నోటీసు నిమిత్తం వాయిదా ది. 9-12-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదాతేది : ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకొన వలసినది. లేనియెడల పై నెంబరు అపీలు మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:09-12-2024

SHAKE FIROJ BASHA, PETA, PRATHYUSHA.
Advocates, Tenalil.
తెనాలి : **Ph : 9293052501**

ఇందిరా గాంధీకి నివాళి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు, అతిథులు

జిల్లా గ్రంథాలయంలో ఇందిరాగాంధీకి నివాళి

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయం మీటింగ్ హాల్‌లో ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ మహిళా కాలేజి అధ్యాపకులు డాక్టర్ వాసిరెడ్డి భవాని, డాక్టర్ డి.ధాత్రికుమారి, రిటైర్డ్ టీచర్ ఎ.వి.కె.సుజాత, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, ఉపగ్రంథపాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాదక ద్రవ్యాలు-యువతపై ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ యం.సీతారామయ్య, లైబ్రేరియన్ కె.చిన్నపరెడ్డి, యన్.నాగిరెడ్డి, ఐ.వి.దుర్గారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా మంగళ వారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగంలో జరిగిన ఈ పోటీల్లో 80 మంది పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు, న్యాయ నిర్ణేతలుగా సుబ్బాయమ్మ, కే సాయి వైష్ణవి, టి స్వర్ణలత వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి ఎస్ కె నాగూర్ భాష కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రజాశక్తి, పెదనందిపాడు : పెదనందిపాడు శాఖా గ్రంథాలయం లో విద్యార్థులు, మహిళలకు సజనాత్మక కత్యాలు, రంగవల్లులు, అల్లికలు పై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పి సుభాషిణి, అశోక్‌హైస్కూల్ డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ ప్రసంగించారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : స్థానిక నెహ్రూనగర్ లోని గ్రేడ్ వన్ గ్రంథాలయ శాఖలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధి జయంతి సందర్భంగా పలు పాఠశాల విద్యార్థినులకు, మహిళలకు రంగవల్లి పోటీలు నిర్వహించారు. భారతదేశ తొలి ఏకైక ప్రధానిగా ఇందిరాగాంధీ సాధికారత కు పెద్ద పీఠ వేశారని లైబ్రేరియన్ కావూరి రమాదేవి తెలిపారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - కొల్లిపర : ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా కొల్లిపరలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశామని మంగళవారం ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌లను జరిమానా నిమిత్తం తహశీల్దార్‌కు బదిలీ చేశామని ఎస్ఐ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేసినట్లయితే ట్రాక్టర్‌కు రూ.10వేలమజరిమాన విధించడం జరుగుతుందన్నారు. ట్రాక్టర్ ముందు భాగంలో ఉచిత ఇసుక రవాణా ప్లెక్సీ తప్పనిసరి అని తెలిపారు.

కోర్టు వారి సమనులు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు అద్దంకి

O.S.No:226/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్టూరు బ్రాంచ్ తరుపున మేనేజర్ గారు ..... వాది

మరియు

అన్నలదాసు సుబ్బారావు ......ప్రతివాది

To.

ప్రతివాది : అన్నలదాసు సుబ్బారావు,
తండ్రి జేసురత్నం, డోర్ నెంబర్ 33-3-3,
సంజీవ నగర్, పురుషోత్తపట్నం, చిలకలూరిపేట,
పల్నాడు జిల్లా

ప్రతివాది అయిన మీపై, వాది అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్టూరు వారు తమ బాకి రాబట్టుకోనుటకు, మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ వారి కోర్టు లో O.S. No.226 /2023 దావా వేయగా, ప్రతివాది అయిన మీకు అనేక పర్యాయములు దావా సమన్లు పంపినను తీసుకోన కుండా కాలయాపన చేయుచున్నదున కోర్టు వారు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు సమన్లు జారీ చేయమనిఉత్తర్యులు ఇచ్చియున్నారు. కావున తేది : 16-12-2024 న ఉదయం గం 10:30 ని:లకు మీరు స్వయంగా గాని లేక, మీ తరుపున న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టు వారిఎదుట హాజరై మీకు ఏమైనా ఆక్సేపణలుఉన్న యెడల తెలియ జేసుకోనవలయును. లేని యడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

వాయిదా తేది : 16-12-2024

అద్దంకి

తేది : 19-11-2024. ఇట్లు

నాదెండ్ల దశరథరామయ్య
వాది తరుపు అడ్వకేట్, అద్దంకి
సెల్ : 9701488099

IN THE COURT OF HON'BLE II ADDL.DISTRICT JUDGE AT :: SANGAREDDY

IA NO. 172 OF 2021

IN

O.S.No. 186 OF 2017

Between:

Smt.Hanisanpally Nirmal. ...Petitioner / Plaintiff.

AND

Sri.Chinnagari Ravinder Reddy & others. ...Respondents / Defendants.

1. K.Tulisamma W/o.K.Venkateshwara Reddy, Age:81 years, Occ;House hold, R/o.H.No.5-87-123, Third line, Laxmipuram, Gunturu, A.P. R-4.

WHERE AS the Petitioner / Plaintiff has filed above Petition in IA No.172 of 2021 to implead you (mentioned the above) as the defendant in the above suit in OS No.186 of 2017, which is pending before the Hon'ble II Addl. District Judge, at Sangareddy, Telangana. The said Petition is posted on dated:29-11-2024 for your appearance. You are hereby required to appear in the Court on that day at 10.30 A.M. either in person or Pleader, failing which the matter will be decided as per law.

// BY ORDER OF THE COURT//

M. ANTHAIAH,
Advocate,
Sangareddy Town & District.
Cell: 9032815639 / 9490184879.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- మాచర్ల, విపి సౌత్ : మండల పరిధిలోని మండాది ఎర్రపాలెం గుండ్లపాడు రచ్చ మల్లపాడు పొలాలలో వ్యవసాయా నికి ఉపయో గించే 25 కెవి, 16 కె.వి 19 ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ల పైభాగాన్ని తొలగించి అందులో ఉన్న రాగి వైరును దొంగలించిన దొంగలను మంగళవారం అరెస్టు చేసి అదుపులోకి తీసుకోవడం జరిగిందని గురజాల డిఎస్పీ జగదీష్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ రాగి వైరు 260 కేజీలు కాగ, వీటి విలువ రూ.3 లక్షల 12వేలు ఉంటుందన్నారు. మాచర్ల పట్టణం తొమ్మిదవ వార్డు రేకులగడ్డ కాలనీకి చెందిన మేదర నాగ రాజు, 10వ వార్డుకు చెందిన తమ్మిశెట్టి కిషోర్, సెరీన్ కాలనీకి చెందిన బెల్లి రాజులు స్నేహితులని, ఈ ముగ్గురు చెడు వ్యసనాలకు బానిసలై రాత్రి సమ యాలలో పొలాల్లో వ్యవసాయానికి ఉపయోగించే ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైర్లను దొంగలిస్తున్నట్లు తెలిపారు. వెల్దుర్తి మండలమే కాకుండా మాచర్ల పట్టణం, మాచర్ల రూరల్, రెంటచింతల, కారంపూడి, ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలంలో కూడా ఈ దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. వెల్దుర్తి పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ సమందరవలి తన సిబ్బందితో కలిసి మండాది గ్రామ శివారులో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. రైతులను నష్ట పరుస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల వైర్ల దొంగలను పట్టుకున్నందుకు గురజాల డిఎస్పి జగదీష్ ఎస్ఐ సమందరవలిని, సిబ్బందిని అభినందించారు.

పిడుగురాళ్లలో తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో నిషేధిత తెలంగాణ రాష్ట్రానికి చెందిన 59 బాటిళ్ల మద్యాన్ని మంగళవారం ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సిఐ కర్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యాన్ని అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి మద్యం అమ్ముతున్న దప్పిలి ఆంజనేయులు రెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద తెలంగాణ రాష్ట్రానికి చెందిన మాన్షన్ హౌస్ 750 మిల్లీ 9, మరియు 180 మిల్లీ 50 బాటిళ్లు స్వాధీనం చేసుకుంన్నామని తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా, కోర్టు ముద్దాయికి 15 రోజులు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల మండల కేంద్రం లో ఎక్సైజ్ ఎస్సై కె శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి బుధవారం దాడులు చేసి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామిరెడ్డి ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్దనుండి లాన్సర్ విస్కీ 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

ప్రజాశక్తి - రెంటచింతల

ఎస్సై ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఓ యువతీ దగ్గర రూ.25 లక్షలు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై సిహెచ్ నాగార్జున మంగళవారం తెలిపారు. కడప జిల్లా కాజీపేటకు చెందిన చెలతోటి లోకేష్ రెంటచింతల లోనే ఎర్రబాలెం చెందిన మస్తాన్ బి వద్ద 2023 జూన్ నుంచి విడతల వారీగా 25 లక్షలు వసూలు చేశాడు. అయితే ఎప్పుడు అడిగినా రేపు మాపు జాయినింగ్ ఆర్డర్ వస్తుందంటూ మోసం చేశాడు. భాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు లోకేష్‌ను అరెస్టు చేసి మాచర్ల కోర్టులో హాజరపరచారు. కోర్టు లోకేష్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయినది

పల్నాడు జిల్లా నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామానికి చెందిన దుంపేటి. వెంకట శివ గోపి తండ్రి శ్రీనివాస రావు కు సంబంధించి పాస్ పోర్ట్ పోయినది. విజయవాడ రీజినల్ పాస్ పోర్ట్ కార్యాలయం 12/07/2022 జారీ చేసిన W 3825384 నంబరు గల పాస్‌పోర్ట్ పోయినది. 06/09/2024 నకరికల్లులో జిరాక్స్ తీయించడానికి ద్విచక్ర వాహనంపై వెళు తుండగా మార్గమధ్యంలో పాస్ పోర్ట్ పోయినది. ఎవరికైనా దొరికిన ఎడల కింది చిరునామాకు అందజేయగలరు.

ఇట్లు

దుంపేటి వెంకట శివ గోపి తండ్రి శ్రీనివాసరావు
రూపినగుంట్ల గ్రామం, నకరికల్లు మండలం
పల్నాడు జిల్లా. ఫోన్ నెంబర్.9703893121

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మండల శాఖ స్వర్ణోత్సవ మహాసభ బి.గోవింద నాయక్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి.నాగేశ్వరరావు, గౌరవాధ్య క్షులుగా బి.రాము నాయక్, సహాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, మహిళా సహాధ్యక్షులుగా జి.సుధా, కోశాధికారిగా బి.ప్రకాష్ రావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్ వ్యవహరించారు. ఎం.రవిబాబు, పోల య్య, బి.నాగేశ్వరరావు, జి.నాగరాజు పి.ఎ.జిలానీ, జి.రామా రావు, పి.రమేష్‌బాబు, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే కృషి

ప్రజాశక్తి - వినుకొండ

పోలవరం ప్రాజెక్టు, నదుల అనుసంధానం సాకారం చేయడం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని అసెంబ్లీలో ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై స్వల్ప కాలిక చర్చలో భాగంగా మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ పోలవరం, వినుకొండ ప్రాంతానికి కీలకమైన బొల్లాపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తుందని, గోదావరి-పెన్నా అనుసంధానంతో గుంటూరు, ప్రకాశం, రాయలసీమను సస్యశ్యామలం అవుతాయని చెప్పారు.

వర్సిటీ జూడో జట్టుకు 'కృష్ణవేణి' విద్యార్థి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జూడో జట్టుకు తమ విద్యార్థి పి.శ్రావణ్ కుమార్ ఎంపికైనట్లు కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల జూడో పోటీలు డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజకల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా శ్రావణ్ కుమార్ మైనస్ 90 వెయిట్ కేటగిరీలో ఎంపికైనట్లు చెప్పారు. ఎల్‌ఎన్సిటి (భూపాల్)లో ఈ నెల 27 నుండి 30 వరకు నిర్వహించే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయం పోటీలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు శ్రావణ్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల పీడీ ఈదర ఆదిబాబు తెలిపారు.

ప్రపంచ తెలుగు బాలోత్సవాల్లో గన్నవరం పాఠశాల విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పెదకాకాని మండలం నంబూరులోని వివిఐటి విద్యా సంస్థల్లో ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు బాలల దినోత్సవాల్లో మాచర్ల మండలం గన్నవరం ఎంపియుపి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్ఎం పి.అన్వర్‌ఖాన్ తెలిపారు. హిందీ ఉపాధ్యాయిని డాక్టర్ సాంబేలు శాంతిబాయి శిక్షణలో విద్యార్థులు జానపద నృత్యాలు, మట్టితో బొమ్మలు చేద్దాం, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్, ప్లేయింగ్, డ్రాయింగ్, కవిత రచన, జానపద గీతాల పోటీల్లో ప్రథమ, తృతీయ బహుమతులు సాధించారని అభినందించారు.

సూపర్-6 పథకాలను అమలు చేయకుంటే ఉద్యమం : సిపిఎం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర విభజన హామీలను, రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం కేంద్ర సంస్థలు, ప్రత్యేక హోదా సాధన విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సిపిఎం సత్తెనపల్లి మండల మహాసభ మండలంలోని కందులవారిపాలెంలో కామ్రేడ్ బగ్గి వెంకటేశ్వర్లు ప్రాంగణంలో మంగళవారం జరిగింది. జెండాను సీనియర్ సభ్యులు హుస్సేన్ షా ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ ప్రారంభోపన్యాసం చేస్తూ బిజెపికి తొత్తులుగా రాష్ట్రంలోని టిడిపి, జనసేన, వైసిపి మారాయని విమర్శించారు. గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలును విస్మరించిందనా్రు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుంటే పోరాడతామన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిరుద్యోగులను వేధించడం మంచి పద్ధతి కాదన్నారు. రైతులు, కౌలు రైతులను, కూలీలను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అనంతరం పలు సమస్యలపై తీర్మానాలను ఆమోదించారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలని, బీమా పరిహారం అందించాలని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని, కొండమోడు- పేరేచర్ల జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల కు న్యాయమైన నష్టపరిహారం చెల్లించా లని, గోదావరి-పెన్నా నదుల అనుసం ధాన ప్రాజెక్టును పూర్తి చేసి అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్‌లు ఏర్పాటు చేయా లని, మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభ ఆమోదించి ంది. ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. జి.బాలకృష్ణ, డి.విమల, జి.రజిని పాల్గొన్నారు.

1.5 శాతం ప్రీమియం నగదు చెల్లింపుతో పంటల బీమా

ప్రజాశక్తి - వినుకొండ

పంటల బీమాకు రైతులు ప్రీమియం చెల్లించడం ద్వారా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్ బీవై) పథకం కింద బీమా ప్రయోజనాలు పొందవచ్చని ఎడిఎ బోయపాటి రవిబాబు మంగళవారం తెలిపారు. అతివృష్టి, అనావృష్టి, ప్రకృతి వైపరీత్యాలు, ముప్పేట దాడి చేస్తున్న నేపథ్యంలో బీమా ప్రీమియం చెల్లించడంపై రైతులు శ్రద్ధ చూపించాలని కోరారు. రబీ కాలానికి పల్నాడు జిల్లాలో బీమా కింద వరి పంటను ప్రభుత్వం ఎంపిక చేసిందని, గ్రామం యూనిట్‌గా పరిగణిస్తామని చెప్పారు. రబీలో వరి పంటకు ఒక హెక్టారుకు (రెండున్నర ఎకరాలు) బీమా ప్రీమియం రూ.1,05,000 కాగా, రైతు రూ.1575 (1.5 శాతం) చెల్లించాలని, ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్ సంస్థ జిల్లాలో బీమాను అమలు చేస్తుందని పేర్కొన్నారు.

ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుంటేనే..

రైతులు తాము సాగు చేస్తున్న పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. బ్యాంకులో పంట రుణం తీసుకుంటే అందులో నుంచి బీమా ప్రీమియాన్ని మినహాయించుకుంటారని, బ్యాంకుల నుంచి రుణం తీసుకోని రైతులు మీ-సేవ కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, తమ ఖాతాలున్న బ్యాంకుల్లో నగదు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రబీ లో సాగు చేస్తున్న వరి పంటకు డిసెంబరు 31 లోపు ప్రీమియం చెల్లింపునకు గడువు ఉందని, ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం, పట్టాదారు పాసుపుస్తకం, పంట ధ్రువీకరణ పత్రం, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరుతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని రైతులకు సూచించారు.

77 మందిలో 52 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- మాచర్ల

నిరుద్యోగాన్ని రూపుమాపడానికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తున్నదని, ఉద్యోగ మేళాలు నిర్వహిస్తుందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజిరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ డ్రైవ్‌ను నిర్వించారు. 4 కంపెనీలు చేపట్టిన ఇంటర్వ్యూలకు 77 మంది హాజరయ్యారు. వీరిలో 52 మంది ఉద్యోగాలకు ఏంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి, జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి ఎం.రవీంద్ర నాయక్, మాచర్ల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ఆర్.కిరణ్ నాయక్, శ్రీకాంత్, వీరంజనేయులు పాల్గొన్నారు.

క్రోసూరులో 31 మందికి..

ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. 4 కంపెనీలు చేపట్టిన ఇంటర్వ్యూలకు 66 మంది హాజరుకాగా వీరిలో 31 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ బి.వి. రమాదేవి, క్రోసూరు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ బి. అంజిరెడ్డి, బి.మహిధర్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వై.పి.శ్రీనివాస్ సీడాప్ పీవో నాగుల్ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్.. పరిశీలనకు వెళ్లిన సర్వేయర్ అడ్డగింత

ప్రజాశక్తి - బెల్లంకొండ

గుంటూరుకు చెందిన వ్యక్తి అక్రమ మైనింగ్‌కు పాల్పడడమే కాకుండా చంపుతామని బెదిరిస్తున్నాడని మండలంలోని పాపాయిపాలేనికి చెందిన యడవల్లి శ్రీనివాసరావు మీడియా ఎదుట ఆరోపిస్తున్నారు. తన సోదరి యరగాని నాగమ్మ చెందిన సర్వేనెంబర్ 334/1బి2లో మూడెకరాల్లో మైనింగ్ కోసం తాను దరఖాస్తు చేశానని, ఈ భూమి పక్కనే ఉన్న భూమిలో గుదే లక్ష్మణ్‌బాబు మైనింగ్ లీజుకు తీసుకుని దాన్ని గుంటూరుకు చెందిన అర్తిమళ్ల శ్రీనివాస్‌కు సబ్ లీజ్‌కు ఇచ్చారని తెలిపారు. అర్తిమళ్ళ శ్రీనివాస్ అతను సబ్‌లీజుకు తీసుకున్న భూమితోపాటు తన సోదరి నాగమ్మ భూమిలోనూ రాత్రిపూట మైనింగ్ చేస్తున్నారని చెప్పారు. దీనిపై తాము ప్రశ్నించగా తాను అధికార పార్టీకి చెందిన నాయకుణ్ణని, తననేమీ చేయలేరని బెదిరిస్తున్నాడని, అడ్డొస్తే చంపటానికి కూడా వెనుకాడబోమని శ్రీనివాస్ కుమారుడు చంద్రబాబు హెచ్చరికలు జారీ చేస్తున్నాడని, ఫోన్ చేసి ఆ భూమిపి కూడా తనకు లీజుకివ్వకుంటే అంతు చూస్తామంటూ తనతోపాటు సోదరిని ఆర్తిమళ్ల శ్రీనివాస్ బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అతని నుండి తమకు ప్రాణహాని ఉందని, అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు తాము తహశీల్దార్‌ను సంప్రదించగా క్షేత్రస్థాయి సర్వేకు సిబ్బందిని తహశీల్దార్ ఆదేశించారని, అయితే సర్వేయర్‌ను కూడా ఆర్తిమళ్ల శ్రీనివాస్ కుమారుడు చంద్రబాబు అడ్డుకున్నారని ఆరోపించారు.

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

రోల్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - క్రోసూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఈనెల 18న నిర్వహించిన రోల్ బాల్‌లో క్రోసూరులోని సెయింట్ ఆన్స్ స్కూల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో షేక్ అబూబకర్, కె.అక్షయ ప్రణీత్, అండర్-17 విభాగంలో ఎస్.జాకీచాన్, యు.ప్రసన్, ఎస్.జాహ్నవి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సిస్టర్ మేరీ రజిత తెలిపారు. వీరు వచ్చేనెల తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పిఇటి ఎం.వెంకటరావు తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సామాజిక పింఛన్ల పంపిణీలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని, హెల్త్ క్లినిక్‌లు శుభ్రం చేసేందుకు పంచాయతీ పారిశుధ్య కార్మికున్ని నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సోమ్లు నాయక్, ప్రధాన కార్యదర్శి పి.సాయి ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ ,రేఖ, లీలా కష్ణ , కోశాధికారి వెంకట్రావు, నాగలక్ష్మి, కోటేశ్వరమ్మ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

26న గుంటూరులో ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయండి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రైతాంగ సమస్యలు పరిష్కార నిమిత్తం సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 26న గుంటూరులో నిర్వహించే భారీ ర్యాలీ, సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు కోరారు. బుధవారం దుగ్గిరాల ప్రజాసంఘాల కార్యాలయంలో చలో గుంటూరు జయప్రదం చేయాలని సిఐటియు, కౌలు రైతు, వ్యకాస సంఘాలతో సమావేశం వ్యకాస జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జొన్నా శివవశంకరరావు మాట్లాడుతు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వము రైతు వ్యతిరేక విధానాల అవలంబిస్తుందని విమర్శించారు. గతంలో ఢిల్లీ పోరాటం జరిగిన సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి దొడ్డి దారిన రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అన్నారు. పంటల మద్దతు ధరలను చట్ట రూపంలో తీసుకురావడం విఫలమైందన్నారు. వ్యవసాయ బోర్లకు మీటర్లు పెట్టే ప్రక్రియను ఆపాలన్నారు. పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే ఆయా పంటలకు కల్పించాలన్నారు అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్న రూ.20 వేలు రైతులు కౌలు రైతుల ఖాతాలలో జమ చేయాలన్నారు. గత ఏడాది వరి పంట ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వస్తే వరదలు వర్షాల ప్రభావం వలన ప్రస్తుత దిగుబడి 30 బస్తాలకు మించడం లేదని, గత సంవత్సరం 75 కిలోల బస్తా రూ.1800 ఉంటే ప్రస్తుతం రూ. 1450 పడిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 100 కిలోల బస్తాకు రూ. 2320, 75 కిలోల బస్తాకు రూ. 1740 ఉందని, ఈ క్రమంలో మద్దతు ధరల ప్రకారం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు సేవా కేంద్రాల ద్వారా వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇవ్వటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో జరుగు ప్రదర్శన సభను జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పనికి ఆహార పథకానికి తూట్లు పొడుస్తుందని, బడ్జెట్లో నిధులు కోత పెడుతూ పని దినాలు తగ్గిస్తుందని విమర్శించారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి వై బ్రహ్మేశ్వర రావు మాట్లాడుతూ పెద్ద వడ్లపూడి హై లెవెల్ ఛానల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును వెంటనే పూర్తి చేసి రబీలో రైతులకు నీరందించాలన్నారు. యోగేశ్వరరావు మాట్లాడుతూ దుగ్గిరాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం నాయకులు బి అమ్మిరెడ్డి అద్దంకి పాములు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

24న యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవ మహాసభలు నవంబర్ 24న గుంటూరులోని ఎన్జీవో కళ్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ తెలియజేశారు. ఈ మేరకు బుధవారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో మహాసభ పోస్టర్‌ను రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేసిన జీవో నెంబర్ 117 రద్దు చేయాలని కోరారు. స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్రంలో ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఉపాధ్యా యులపై బోధనేతర కార్యక్రమాలను బలవంతంగా రుద్ది బోధనకి దూరం చేయడం సరి కాదని, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రచురణ విభాగం చైర్మన్ యం.హనుమంతరావు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి తక్షణం అమలు చేయాలని, అప్పటివరకు 30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాట్లాడుతూ 24న ఉదయం 9గంటలకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి స్వర్ణోత్సవ ర్యాలీ ఉంటుందని, తర్వాత 10 గంటలకు సభ ప్రారంభం అవుతుందన్నారు. ప్రారంభ సభలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర నాయకులు, పూర్వ నాయకులు పాల్గొంటారని తెలిపారు. కావున ఉపాధ్యాయులు వేలాదిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా నాయకులు జి.వెంకటేశ్వర్లు, ఎండి.దౌలా, సిహెచ్.ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, యం.గోవిందయ్య, అడవి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎన్.వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు

ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షునిగా డాక్టర్ నందకిషోర్ ఎన్నిక

జోనల్ కార్యదర్శిగా డాక్టర్ సేవాకుమార్

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ నంద కిషోర్

డాక్టర్ సేవాకుమార్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా 2024 - 25 సంవత్సరానికి గుంటూరు ఐఎంఏ బ్రాంచ్‌కి చెందిన డాక్టర్ గార్లపాటి నందకిషోర్, జోనల్ సంయుక్త కార్య దర్శిగా డాక్టర్ టి.సేవాకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వై.సుబ్బారాయుడు, డాక్టర్ బి.సాయికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందకిషోర్ చీరాలలో గార్లపాటి శరాబంది, వసంతలక్ష్మి దంపతులకు జన్మించారు.సిద్ధార్థ, గుంటూరు మెడికల్ కళాశాలలో ఎం.బి.బి.ఎస్ పూర్తి చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్రమెడికల్ కాలేజీలో చెవి ముక్కు గొంతు వైద్య విభాగంలోఎం.ఎస్ పూర్తి చేశారు. తర్వాత అపోలో, దక్కన్, కాటూరి వైద్య కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. ఐఎం ఏలో బ్రాంచ్‌స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ పలు బాధ్యతలు నిర్వహించారు. జోనల్ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ టి.సేవాకుమార్ తాతా నాగేంద్రరావు, కనక దుర్గ దంపతులకు బాపట్లలో జన్మించారు. గుంటూరు వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. 1996లో బ్రాడీపేటలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ స్థాపించి అతి తక్కువ ఖర్చుకి వైద్య సేవలు అందిస్తున్నారు. వీరు ఇరువురు ఈనెల 23వ తేదీన గుంటూరులో జరుగుతున్న మూడు రోజుల 66వ ఐఎంఏ రాష్ట్ర సదస్సులో ప్రమాణ స్వీకారం చేస్తారని డాక్టర్ సుబ్బా రాయుడు, డాక్టర్ సాయి కృష్ణ తెలియజేశారు.

తూములూరులో నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కొల్లిపర : తూములూరులో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెనాలి ఏడిఏ ఉషారాణి డీసీఎంఎస్ అధికారి హరి గోపాల్ మంగళవారం తెలిపారు. రైతు సేవా కేంద్రం లో ఈ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

మానవ జీవితాల్లో ఔషద రంగం కీలకమైనది

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న ఏడుకొండలు

మానవుని నిత్య జీవితంలో ఔషదరంగం చాలా కీలకం అని హైదరాబాద్ న్యూల్యాండ్ ప్రయోగశాలకు చెందిన ట్రైనర్ టి.ఏడుకొండలు అన్నారు. స్థానిక టిజెపియస్ కాలేజిలో మంగళవారం 'ఔషద రాంగాలలో ప్రయోగాలు- సాంకేతికత' అనే అంశం వర్క్‌షాప్ నిర్వహించారు. ఏడు కొండలు మాట్లాడుతూ రసాయన శాస్త్ర విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, మానవుని జీవితం ఆరోగ్యవంతంగా ఉండటానికి ఔషదాలు ముఖ్యమైన పాత్ర వహిస్తాయని, ఏ ఔషదానికి ఎంత పరిమాణంలో మందులు కలిపే క్రమాన్ని, ఒక ప్రణాళిక ప్రకారం ఔషదాలు తయారు చేసే స్థితిని గూర్చి వివరించారు. ప్రయోగశాలలో కొన్ని ఔషదాలు తయారుచేసి చూపించారు. తరువాత విద్యార్థులతో కూడా మందులు తయారీ విధానాన్ని నేర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి, రసాయన శాస్త్ర శాఖాదిపతి యం.యల్.యన్.రాజగోపాల్, అధ్యాపకులు షేక్ సల్మాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

కళ్లం కాలేజీలో టెక్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం ఇంజినీరింగ్ కాలేజిలో 3 రోజుల టెక్‌క్యాంపు- గూగుల్- ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ సాంకేతిక అంశంపై విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ క్యాంప్‌లో వందమందికిపైగా బిటెక్ 3వ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారని కాలేజి డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బియస్‌బిరెడ్డి మాట్లాడుతూ టెక్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు అనేక సాంకేతిక అంశాలపై శిక్షణ పొందడమే కాకుండా గూగుల్- ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై ప్రయోగాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్- కెరీర్ గైడెన్స్ విభాగాధిపతి డాక్టర్ పీ.ఎల్.మాధవరావు, సాంకేతిక శిక్షకుడు చందన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్యాంప్‌కు హాజరైన విద్యార్థులు

మున్సిపల్ సమస్యలపై వార్డుల్లో పర్యటన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పురపాలక సంఘ పరిధిలో పారిశుధ్య పనులను తెనాలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. మంగళవారం 15వ వార్డులో ప్రజా సమస్యలపై అధికారులతో కలసితిరిగారు. పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపిడిఓ

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు మండలంలోని పేరేచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధార్ శిబిరాన్ని ఎంపీడీఓ తోట చందన సోమవారం పరిశీలించారు. శిబిరంలో సుమారు 50 నవీకరణలు, ఎన్‌రోల్‌మెంట్‌లు జరిగాయి. 20వ తేదీ కూడా పేరేచర్లలో ఆధార్ క్యాంపు కొనసాగుతుందని అని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

బాలోత్సవ్‌లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

నంబూరులోని వివిఐటి కాలేజిలో నిర్వహించిన బాలోత్సవ్‌లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు జెడ్‌ఈవో వరలక్ష్మి తెలిపారు. కీబోర్డులో యోగానంద శాస్త్రి ప్రథమ బహుమతి, జూనియర్స్ విభాగంలో రెండో బహుమతి, కూచిపూడిలో నిఖితలక్ష్మి రెండో బహుమతి, జానపద నత్యంలో దీపిక మూడో బహుమతి, క్లాసికల్ డాన్స్‌లో సంస్కృతి మూడో బహుమతి, యోగానందశాస్త్రి కూచిపూడిలో నాలుగో బహుమతిని అందుకున్నట్లు ఆమె తెలిపారు. పోటీలో గెలుపొందిన విజేతలను జెడ్‌ఈఓ వరలక్ష్మి అభినందించారు.

సిపిఎం అభిమాని నాగేంద్రం కన్నుమూత

ప్రజాశక్తి - మంగళగిరి

పట్నంలోని రత్నాల చెరువులోని సిపిఎం సభ్యుడు పచ్చల నాగేంద్రం (60) సంవత్సరాలు మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. నాగేంద్రంకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘ వులు, పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమ లాకర్, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, పట్టణ నాయకులు ఎం చలపతిరావు, జె శివ భవన్ నారాయణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు గోలి దుర్గాప్రసాద్, ఈ కాటమరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం అభివృద్ధికి, పేదల సమస్యల పరి ష్కారానికి నాగేంద్రం నిరంతరం పనిచేశారని కొనియాడారు.

నాగేంద్రం భౌతికకాయంపై పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

బాలోత్సవంలో ఇంటెల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మేడికొండూరు

విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పేరేచర్ల ఇంటెల్ హై స్కూల్ ప్రిన్సిపల్ కోనూరి అశోక రాణి జయకుమార్ అన్నారు. ఇటీవల గుంటూరు సమీపంలోని వివిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16 న నిర్వహించిన తెలుగు బాలల పండుగ బాల ఉత్సవ్ కార్యక్రమంలో ఇంటెల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఏకపాత్రలు విభాగంలో ఝాన్సీ లక్ష్మీబాయి పాత్రధారి ఎం వెంకట పూజ కన్సొలేషన్ బహుమతి, నాటికలు విభాగంలో కార్తీక్ కుమార్ అండ్ టీం కు మొదటి బహుమతి సాధించారు. బహుమతి సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ఇంటెల్ హైస్కూల్లో అభినందన సభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమాన్ని నిర్దేశించి ప్రిన్సిపల్ కోనూరి అశోకా రాణి జయ కుమార్ మాట్లాడుతూ కళలు విద్యార్థుల జీవితాల్లో నూతన ఆలోచనల్ని కలిగిస్తుందని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు మంచి వాతావరణం లో ఎదుగుతారని అన్నారు. ప్రస్తుత సమాజంలో అన్ని రంగాలలో ప్రతిభ కనబరిచి ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు జే సుకన్య, పిల్లలు విజయం సాధించడానికి ముఖ్య కారకులైన ఇంటెల్ స్కూల్ పిడి ఎస్.కె రన్ను హుస్సేన్ ను ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలపై నేడు ధర్నాలు : ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో అన్ని డిపోల్లో బుధవారం జరిగే నిరసనలను జయప్రదం చేయాలని చిలకలూరిపేట అధ్యక్ష, కార్యదర్శులు యోహాను, ఫణీంద్ర కుమార్ కోరారు. నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు, టిఎ బిల్లులు, ఇతర అలవెన్సులు చెల్లించాలని, 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, జీవో 71ను మార్చాలని చీటికి మాటికి కేసులు రాసే పద్ధతి ఆపాలని, కొత్త బస్సులు కొనాలని, కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. స్క్రాప్ చేయాల్సిన స్థాయిలో ఉన్న బస్సులను, గ్యారేజీ కార్మికులు రిపేరు చేస్తున్న గ్యారేజీ సిబ్బంది, సూపర్వైజర్లపై పని ఒత్తిడి వేధింపులు మానుకోవాలన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- మాచర్ల

వచ్చేనెల 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తామని మండల న్యాయ సేవా కమిటి ఛైర్మన్, ప్రధాన సివిల్ జడ్జి ఎన్. శ్రీనివాసకళ్యాణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిల్ కేసులు, భరణం, గృహహింస, బ్యాంకు కేసులు, రాజీచేయదగిన క్రిమినల్ కేసులు, ముందస్తు రాజీ చేసుకోదల్సిన కేసులులను ఇరు పక్షాలు సామరస్య పూర్వకంగా రాజీ చేసుకోవాలని సూచించారు.

డివైడర్లపై ముళ్ల చెట్లు తొలగింపు

ప్రజాశక్తి- మాచర్ల : పట్టణంలోని రింగ్ రోడ్డు సెంటర్ నుండి పార్క్ సెంటర్ వరకు ఉన్న డివైడర్‌పై ముళ్లకంపచెట్లు పెరిగి పాదచారులకు, వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. ఈ సమస్యపై సోమవారం ప్రజాశక్తిలో 'వాహనదార్లకు ప్రమాదకరంగా పిచ్చికంప' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మన్సిపల్ కమిషనర్ వేణుబాబు మంగళవారం మున్సిపల్ సిబ్బందితో ముళ్లకంపను తొలగింపజేశారు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కొమ్మలను కొట్టివేయించారు.

డాక్టర్ల నియామకంపై హర్షం

ప్రజాశక్తి - పెదకూరపాడు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటేషన్‌పై డాక్టర్లను నియమించినందుకు పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్ దర్శి శేషారావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రెండు నెలల పాటు అధికారులతో, ప్రజాప్రతినిధులతో, నాయకులతో చర్చలు జరిపి పలుమార్లు వినతి పత్రాలు అందించామని గుర్తు చేశారు. ఉద్యమం ఫలితంగా ఎనస్తీషియా పిజీ డాక్టర్ నియామకం, గైనకాలజిస్ట్‌ను సత్తెనపల్లి నుండి తాత్కాలిక ప్రాతిపదికన వారానికి ఒకరోజు డిప్యూటేషన్ వేశారని, జనరల్ సర్జన్‌ను కూడా వేయనున్నారని పేర్కొన్నారు. ఒక నెల రోజుల్లో శాశ్వత ప్రాతిపదికన డాక్టర్లు నియమిస్తామని జిల్లా అధికారులు తెలిపారని, ఇందుకు సహకరించిన ఎమ్మెల్యేతోపాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పనులను వెంటనే పూర్తి చేయండి

ప్రజాశక్తి - దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డు పరిధిలో గల ఎమ్మెస్ పేటలోని ముస్లిమ్ శ్మశాన వాటికలో నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని కౌన్సిలర్ షేక్ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎనిమిది నెలల క్రితం 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా శ్మశానంలో అంతర్గత రహదారులు, గదిని నిర్మాణం కోసం నగర పంచాయతీ నిధులు కేటాయించారని, పనులు సగం పూర్తయిన తర్వాత సార్వత్రిక ఎన్నికల కారణంగా నిలిచాయని పేర్కొన్నారు. వాటిని పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు.

రైతు ఉద్యమ డిమాండ్ల సాధనం కోసం 26న ధర్నా

ప్రజాశక్తి - వినుకొండ

దేశవ్యాప్త పిలుపు మేరకు పల్నాడు జిల్లా రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన స్థానిక పుతుంబాక వెంకటపతి భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆంజనేయులునాయక్ మాట్లాడుతూ రైతు సమస్యలను పరిష్కరించాలని, ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి నియోజవర్గంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్‌రెడ్డి, నాయకులు బి.వెంకటేశ్వర్లు, పి.వెంకటప్పయ్య, బి.వెంకటేశ్వర్లు, ఎం.చిన్న జన్నమ్మ, కె.శివరామకృష్ణ, పి.ఆశీర్వాదం, పి.వెంకటేశ్వర్లు, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రైతులు, కౌలురైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌ల వద్ద 26న జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

టి.బాబురావు, సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో మహాధర్నా, ప్రదర్శలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10 వేల పింఛనివ్వాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు సిహెచ్.నాగేశ్వరరావు, కె.రోశయ్య, ఎస్.లూథర్, కోటనాయక్, ఎం.హరగోపాల్‌రావు, సిహెచ్.నిర్మల, జి.సావిత్రి, సుభాని, ఎం.నాగేశ్వరరావు, ఎన్.సాయిశ్రీనాథ్ పాల్గొన్నారు.

రేపటి ఎల్‌ఐసి ఏజెంట్ల ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఎల్‌ఐసి ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మచిలీపట్నం డివిజనల్ కార్యాలయం వద్ద ఎల్‌ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాలో ఎల్‌ఐసి ఏజెంట్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని యూనియన్ జాతీయస్థాయి సెంట్రల్ కమిటీ కౌన్సిల్ మెంబర్ షేక్.నబీ బాజి పిలుపునిచ్చారు. నరసరావుపేటలోని ఎల్‌ఐసి కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఏజెంట్ల సమావేశంలో నబీ బాజి మాట్లాడుతూ ఇటీవల ఎల్‌ఐసి యాజమాన్యం, ఐఆర్డీఏ కలిసి తెచ్చిన కొత్త చట్టాలను వ్యతిరేకిస్తూ ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. యాజమాన్యం హామీ ఇచ్చి అమలు చేయకుండా పెండింగ్‌లో ఉంచిన డిమాండ్లను తక్షణమే అమలు చేయాలన్నారు. పెరిగిన ధరల కనుగుణంగా ఏజెంట్ల కమీషన్‌ను పెంచాలని 'క్లాబ్యాక్ ఆఫ్ కమీషన్' విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పాలసీలపై జి.ఎస్.టి రద్దు, గ్రూప్ ఇన్సూరెన్స్ కవరేజి ఏజెంట్లకు రూ.50 లక్షలకు, సి.ఎల్.ఐ.ఏ లకు రూ.కోటి వర్తింప చేయాలన్నారు. గ్రాట్యుటీపై ఉన్న సీలింగ్ ఎత్తివేసి ఏజెంట్ల గ్రాట్యుటీ లెక్కించే విధానంలో మార్పులు చేయాలని, క్లబ్ మెంబర్ 10 ఏళ్ళు సర్వీస్ పూర్తయిన ప్రతి ఏజెంట్‌కు లైఫ్ మెంబర్ పరిగణించాలని డిమాండ్ చేశారు. ఏల్.ఐ.సి హెల్త్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎఫ్.డి.ఐ ల పరిమితి పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, బీమా సుగం, బీమా విస్తార్, బీమా వాహక్ ప్రతిపాదనలు రద్దు చేసి ఏజెంట్లకు ఇపియఫ్, ఇయస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.

మాట్లాడుతున్న ఎల్‌ఐసి ఏజెంట్స్ ఏఓఐ యూనియన్ జాతీయ స్థాయి సెంట్రల్ కమిటీ కౌన్సిల్ మెంబర్ షేక్ నబి బాజీ

తేమ శాతం 8-12 ఉంటేనే పత్తి కొనుగోలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని జలాలపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాఅధికారి ఐ.మురళి మాట్లాడుతూ సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, క్వింటాళ్ రూ.7521 మద్దతు ధరకు పంటను కొంటారని చెప్పారు. రైతులు ముందుగా రైతు సేవ కేంద్రంలోని వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. తేమశాతం 8 నుంచి 12 వరకు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్.శేషుబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు సిహెచ్. సురేష్, పవన్ పాల్గొన్నారు.

మండలంలోని లింగంగుంట్లలో ప్రకృతి వ్యవసాయ రైతు ఏనుబర్ల విజయబాబు పత్తి పొలంలో మంగళవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. జిల్లా అధికార సీఎం రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పత్తిలో అంతర పంటలుగా కంది, బీర, దోస, అలసంద, గోడు చిక్కుడు, బెండ వేసినట్లు చెప్పారు. పత్తిలో అంతర పంటల వల్ల తెగుళ్ల ఉధృతి తగ్గిందని, భూసారమూ పెరుగుతందని చెప్పారు. రైతులకు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. నందుకుమార్, భార్గవ్, మాస్టర్ ట్రైనర్ మధుబాబు, ఇంచార్జ్ అమూల్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

మండల కేంద్రమైన నాదెండ్లలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట సహాయ సంచాలకులు పి.మస్తానమ్మ మాట్లాడుతూ పత్తి పంట అమ్మాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు తీసుకుని వెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.7521 నిర్ణయించారని, తేమ 8 శాతంగా ఉండాలని, 12 శాతం వరకు కొనుగోలు చేస్తారని చెప్పారు. మార్కెటింగ్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఆధార్‌తో అనుసంధానం చేసి బ్యాంకు ఖాతా కలిగి ఉండాలన్నారు. పంటను లూజ్ పద్ధతిలో తీసుకురావాలని ప్లాస్టిక్ సంచుల్లో తెస్తే కొనుగోలు చేయరని చెప్పారు. వెటర్నరీ డాక్టర్ సాంబశివరెడ్డి మాట్లాడుతూ పశుగ్రాసం పెంచేందుకు 10 నుంచి 50 సెంట్లు వరకు ఉపాధి హామీ కింద రాయితీ ఇస్తామన్నారు. 2 హెచ్‌పి చాఫ్ కట్టర్ 40 శాతం రాయితీపై ఎస్సీ, ఎస్టీలకు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్, సిబ్బంది జీవన్ నాయక్, అనుపమ, వేదవతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించగా మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ మాట్లాడారు. మొక్కజొన్నలో విత్తనశుద్ధికి సైంట్రానిలిప్రోల్, థియామెథాక్సమ్ ఎకరానికి 6 మిల్లీ లీటర్లు ఉపయోగించాలన్నారు. కత్తెరపురుగు

పరిశీలనకు ఎకరానికి 5 లింగాకర్షణ బుట్టలు పెట్టాలన్నారు. ఎకరానికి 15 లింగాకర్షణ బుట్టలు పెట్టడం ద్వారా కత్తెర పురుగు ఉధృతిని తగ్గించవచ్చన్నారు. మొక్కజొన్న, శెనగ వేసే రైతులు విత్తన ఎంపిక విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఈ సంవత్సరం రబీ నుండి వాలంటరీ పంటల బీమా వచ్చిందని, రబీలో వరి వేసిన రైతులు పంటల బీమా చేసుకోవాలని సూచించారు. పత్తి పంటను రైతు సేవ కేంద్రంలోని వ్యవసాయ సహయకులను కలిసి రిజిస్టర్ చేసుకుంటే సిపిఐ పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు అమ్ముకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కె.ఎల్.ప్రియాంక, పి.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని దాచేపల్లి, నడికుడిలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి డి.పాపకుమారి మిర్చిపొలాలను పరిశీలించి మాట్లాడారు. సూపర్ ఫాస్పేట్ ఎరువును దుక్కిలో వేసుకోవాలని, లేకుంటే సూపర్ పాస్ఫేట్ ఎరువును వాడతే తాలు శాతం తగ్గి అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. రసాయన ఎరువులకు బదులుగా జీవన ఎరువులు, పశువుల ఎరువులు వినియోగాన్ని పెంచాలన్నారు. కందిలో సస్యరక్షణ చర్యలను వివరించారు. పత్తి పంటను అమ్ముకోవడానికి రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల సూచించారు. వరి రైతులు రూ.630తో మీసేవ కేంద్రాల్లో పంటల బీమా చేయించుకోవాలన్నారు.

అభివృద్ధి సరే... మరుగుదొడ్ల మాటేమిటి?

- అధికారులతో పనుల కోసం వచ్చిన ప్రజలకు తప్పని పాట్లు
- బైపాస్ సర్వీస్ రోడ్డునే కాలకృత్యాలకు వినియోగం
- దుర్గంధం భరించలేమంటున్న స్థానికులు

ఒకవైపు ప్రపంచ మరుగదొడ్ల దినోత్సవాలను అధికారులు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 10వరకు పారిశుధ్యం, మరుగు దొడ్ల నిర్వహణపై ప్రచార కార్యాచరణ చేపట్టారు... మరోవైపు రాజధాని ప్రాంతంలో పనులకోసం వచ్చే ప్రజలకు కనీస మరుగుదొడ్లు నిర్మించడం కూడా మరిచారు... అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్నం తూర్పు వైపున శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వానికి సంబంధించి రాష్ట్ర కార్యాలయా లు అన్ని సుమారు 40 వరకు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. ఎస్సీ కార్పొరేషన్‌తో పాటు వివిధ కార్పొరేషన్ కార్యాల యాలు కూడా ఇక్కడే ఉన్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ప్రజలు నిత్యం పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చి తమ పనులు ముగించుకొని వెళ్తుంటారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నివాసం కూడా ఉంది. అక్కడనుండి నాలుగు కిలోమీటర్ల దూరంలో ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయుడు నివాసం ఉంది. ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఇక్కడే నివాసం ఉంటున్నారు. తాడేపల్లి నుండి రెండు కిలోమీటర్ల దూరం వరకు వివిధ అపార్ట్మెంట్లో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు కూడా నివాసం ఉంటున్నారు. వీరందరి దగ్గరికి ఎవరి వారి అభిమానులు, కార్యాలయాల లో తమ పనులు జరిపించుకోవడం కోసం వచ్చే వారి సంఖ్య ఇటీవల పెరుగుతుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు ఎక్కువగా మణిపాల్ ఆసుపత్రి సమీపంలో దిగి, సమీపంలోని ప్రభుత్వ కార్యాల యంలో తమ పనులు ముగించుకొని వెళ్తుంటారు. అయితే ఈ ప్రాంతంలో సామూహిక మరుగుదొడ్లు లేకపోవడం పెద్ద ఇబ్బందిగా తయారైందని వివిధప్రాంతాల నుండి వచ్చినవారు వాపోతున్నారు. దీంతో ఒకటి వచ్చిన....? రెండు వచ్చినా....? తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో బైపాస్ పక్కనే కదా సర్వీస్ రోడ్లో కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. దీనివల్ల ఆ ప్రాంతమంతా అపరిశుభ్రత వాతావరణంతో పాటు దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీఎం, మాజీసీఎం, వివిధ ప్రభుత్వ కార్యాల

యాలు ఉన్న ఈ ప్రాంతం ఐ సెక్యూరిటీగా ఉన్నది. ఏంటీఎంసీ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారు లతో కలిసి సంయుక్తంగా ఈ ప్రాంతంలో సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఎప్పటికప్పుడు వాటిని క్లీన్ చేయడానికి తగిన సిబ్బందిని నియమించాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

ఘనంగా ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

డిసెంబర్ 10వరకు పారిశధ్య, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రచారం

ప్రజాశక్తి - చేబ్రోలు : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా చేబ్రోలులో ప్రచార కార్యక్రమాలపై ఇన్‌ఛార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమాదేవి సమావేశం నిర్వహించారు.మన మరుగుదొడ్డి మన గౌరవం నినాదంతో పారిశుధ్యం, మరుగుదొడ్డి నిర్వహణ పై గ్రామాల్లో డిసెంబర్ 10వ తేదీవరకు నిర్వహించా ల్సిన కార్యక్ర మాలను వివరించారు. వ్యక్తిగత మరియు కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణపై అందరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. గ్రామస్థాయిలో లైన్ డిపార్ట్మెంట్ల ఉద్యోగుల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను చైతన్యవంతులను చేయాలని చెప్పారు. పరిశుభ్రత పాటించినవారిని గుర్తించి ఉత్తమ టాయిలెట్లను ఎంపిక చేసి గ్రామస్థాయిలో వారిని సన్మానిం చాలన్నారు. కార్యక్రమంలో ఈవో పి ఆర్ అండ్ ఆర్ డి టి ఉషారాణి , ఏ ఈ ఆర్డబ్ల్యూఎస్ పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధిలో భాగస్వాములకు రివార్డులు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కమిషనర్

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో సకాలంలో పన్ను చెల్లించడం, మిద్దెతోటల పెంపకం, ఇంకుడు గుంతల ఏర్పాటు, వ్యర్థాలను తడిపొడిగా వేరుచేసి ఇవ్వడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు, నగర అభివద్ధిలో భాగస్వాములు అయ్యే ప్రజలకు ప్రత్యేక యాప్ ద్వారా సిటిజన్ రివార్డు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జిఎంసి కమిషనర్ ఛాంబర్‌లో సోషల్ ఇంపాక్ట్ ఇన్నోవేషన్ సంస్థ ప్రతినిధి సమీర్ గౌతమ్ సిటిజన్ రివార్డ్స్, అమలు, ప్రజలు వినియోగించుకునే తీరుని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు తమ వంతుగా స్వచ్ఛ గుంటూరులో, నగరాభివద్ధిలో భాగస్వాములు కావడానికి జిఎంసి నుండి ప్రోత్సాహకంగా ప్రత్యేకంగా సిటిజన్ రివార్డ్స్‌ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా సమీర్‌గౌతమ్ మంగళవారం వివరాలను విభాగాధి పతులకు వివరించారని, త్వరలో యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేస్తామన్నారు. నగర ప్రజలు తాము చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లించడం, వ్యర్థాలను వేర్వేరుగా అందించడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారానే ప్రత్యేకయాప్ ద్వారా అందించే క్యూఆర్‌కోడ్ ద్వారా రివార్డ్స్ అందేలా జిఎంసి చేపడుతుందన్నారు.సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాస రావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.

నల్ల మాస్కులతో ఎసిసి కార్మికుల నిరసన

నిరసన తెలుపుతున్న ఎసిసి కార్మికులు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు న్యాయంగా తమకు రావలసిన నష్టపరిహారం కోసం మంగళవారం దీక్ష శిబిరంలో ముఖానికి నల్ల మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎఫ్‌టియు న్యూ నాయకులు కే ఆదినారాయణ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం యాజమాన్యాన్ని చర్చలకు కూర్చోబెట్టి కార్మికులకు న్యాయం చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని ట్రేడ్ యూనియన్లు కార్మికులకు మద్దతిస్తున్న సంగతిని గుర్తు చేశారు. కోర్టులు తీర్పించిన లెక్కచేయక, కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యం చర్చలకు వచ్చే విధంగా ప్రభుత్వం కషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఏం గురవయ్య, భాష, మాణిక్యాలరావు, నాగేశ్వరరావు, సామ్రాజ్యం, ఎమ్మెల నరసింహారావు, నీరుడు దుర్గారావు, బి అంకయ్య, సాంబయ్య, సుబ్బారావు, కష్ణ, నవనీతం, సారమ్మ, దుర్గమ్మ, రమాదేవి, ఇమాంబి పాల్గొన్నారు.

సంఘ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిజిజన్ అధికారి కె వి రామారావు

తెనాలిలో పిఅండ్‌టి సొసైటీ సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : పోస్టల్, టెలికామ్ మ్యూచ్యువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటి ఆధ్వర్యంలో జాతీయ సహకార వారో త్సవాలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని హెడ్ పోస్టాఫీసు సొసైటి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్ర మానికి డివిజన్ కో ఆపరేటివ్ అధికారి కె వి రామారావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సహ కార వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించారు. సహకార సంఘం పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సహ కార సంఘం సేవలను వినియోగించుకోవాలన్నారు. అనం తరం సభ్యులతో సహకార ప్రతిజ్ఞ చేయించారు. సంఘ అధ్యక్షులు టి పోతురాజు, సొసైటి కోశాధికారి టి పోతు రాజు, డైరెక్టర్లు యువి సత్యనారాయణ, వి వెంకటే శ్వర్లు, సంఘ సిఈఒ డివిఎస్ నాగేశ్వరరావు, మాజి డైరెక్టర్లు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాలు - ఆరోగ్యంపై ప్రభావం' వ్యాసరచన పోటీలు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు ఆరోగ్యంపై ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వాహకులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ బి రమేష్ మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా విద్యార్థులు ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల మత్తులో విద్యార్థులు జీవితాలను పాడు చేసుకోవద్దని ఆయన హితవు పలికారు. ప్రస్తుతం గంజాయి, బ్రౌన్ షుగర్, హెరాయిన్, కొకైన్, చెరస్ తదితర మాటక ద్రవ్యాలకు కొంతమంది యువత బానిసలై తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటు న్నారని ఆవేదన చెందారు. క్షణకాలం సంతోషం కోసం విద్యార్థులు నూరేళ్ల జీవితంలో వెలుగులను దూరం చేసుకుంటున్నారని, డ్రగ్స్ నేరుగా మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థ పై ప్రభావం చూపుతాయన్నారు. అనంతరం వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధమ బహుమతి ఎం దివ్యశ్రీ, ద్వితీయ బహుమతి పి పూజిత, తృతీయ బహుమతి విజేత, ఆర్ అలేఖ్య రెడ్డిలకు అంద చేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు బి శ్రీదేవి, ఇ ఆనందరావు, యం.రామ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో క్లబ్ క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో మంగళగిరికి చెందిన అమరావతి తైక్వాండో క్లబ్ క్రీడాకారులు పతకాలు సాధించారని గుంటూరు జిల్లా టైక్వాండో జనరల్ సెక్రెటరీ పి సుబ్బారావు మంగళవారం తెలిపారు. ప్రకాశం జిల్లా కందుకూరు ఇంజినీరింగ్ కళాశాలలో 38వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు నవంబర్ 15-17 తేదీలలో నిర్వహించారని, ఆ పోటీల్లో షేక్ ధనీష్ హుస్సేన్, సిల్వర్ మెడల్ సాధించగా, కె వెంకట సాహిత్, వి నిహాల్, జె భరద్వాజ్ సాయి లు బ్రాంజ్ మెడల్స్ సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఆత్మరక్షణకి, ఎంతగానో ఉప యోగ పడుతుందన్నారు.ఆడపిల్లలకు ఆత్మరక్షణకు తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో తెనాలి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి హాకీ, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో తెనాలి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం పాఠాశాల ఆవరణలో నిర్వహించిన అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు షేక్ మౌలాబి వివరాలు వెల్లడించారు. నవంబరు 16, 17, 18న గుడివాడ, కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 19 హాకీ, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 9 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు పొందారన్నారు. వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో వివిధ కేటగిరిలలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు పెనుమూడి బ్యూలా, జ్యోత్స్న ప్రియ, నవ్య, కొమరగిరి శివయ్య షేక్ హనీఫ్, షేక్ సుహాన అలాగే 8వ తరగతి విద్యార్థులు లీలా గాయత్రి ప్రసన్న, సయ్యద్ సమీరా, షేక్ రియాజ్ లకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు లభించాయని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు టి ప్రసాద కుమారి, కొడాలి గోవర్ధన తెలిపారు. పాఠశాల ఎన్సిసి అధికారి పరిశా సర్దార్, బి శ్రీనివాస్, చక్రవర్తి, సోమరౌతు శ్రీనివాస రావు పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ఆరుబయట మలవిసర్జన సాంఘీక దురాచారం

ప్రజాశక్తి - దుగ్గిరాల : ఆరుబయట మల విసర్జన సాంఘిక దురాచారమని డిపిఒ, మండలం ప్రత్యేక అధికారి బి వి సాయి కుమార్ అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలో మంగళవారం జరిగిన ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వల్ల కోట్లకొలది వ్యాధిని వ్యాపింపజేసే సూక్ష్మ క్రిములు ఉంటాయని వాటి నుండి విముక్తి పొందాలంటే గ్రామాల్లో మరుగుదొడ్లు ఉపయోగించి వాటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడా నికి డిసెంబర్ 10 వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్టు ఆయన తెలిపారు. స్థానిక బాలికల హైస్కూల్ విద్యార్థులతో కలిపి గ్రామంలో ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె జవహర్లాల్ నెహ్రూ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్, ఎంఇఒ కె లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్, టిడిపి నాయకులు గూడూరు వెంకటరావు గద్దె వాసు చంటి నక్క చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంచికలపూడి గ్రామంలోని అంగన్ వాడి సెంటర్లో ఉన్న టాయిలెట్లను పరిశీలించి చిలువూరు గ్రామంలో సర్పంచ్ చిలువూర మాణిక్యంతో కలిసి అంగన్వాడి సెంటర్లో నీటి పంపును ప్రారంభించారు.

చలపతి ఫార్మసీలో చెస్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న రెండ్రోజుల అంతర కళాశాల చదరంగ పోటీలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. ఈసందర్భంగా కాలేజి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల ద్వారా కూడా అత్యున్నత శిఖరాలకు చేరుకో వచ్చని, అందులోనూ చదరంగం వంటి క్రీడల ద్వారా విద్యార్థుల ఆలోచన మెరుగుపడి, ఏకాగ్రత మెరుగుపడుతుందని అన్నారు. గెలుపోటములు ప్రదానం కాదని ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తితో ఆడాలని చెప్పారు. అప్పుడే కోనేరుహంపి, హరికష్ణ, హారిక వంటి క్రీడాకారులు తయారవుతారని చెప్పారు. మొదటిరోజు నిర్వహించిన చదరంగం పోటీలలో 16టీమ్‌లు పాల్గొన్నాయని తెలిపారు.

పోటీలకు హాజరైన విద్యార్థులు

ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మస్తాన్ షరీఫ్‌కు పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట లోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మస్తాన్ షరీఫ్‌కు వైజాగ్ ఆంధ్ర యూని వర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం విభాగంలో 'ఆక్యుపేషనల్ స్ట్రెస్ అండ్ ఇట్స్ ఇన్ఫ్లుయెన్స్ ఆన్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఎమాంగ్ టీచర్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్ ఇనిస్ట్యూషన్స్' అంశంపై పరిశోధనకు పిహెచ్‌డి అందజేశారు. ఈ మేరకు విశాఖపట్నం లోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శనివారం గైడ్ ప్రొఫెసర్ జాలాది రవి, రీసెర్చ్ డైరెక్టర్ ఆంధ్ర యునివర్సిటి ఆధ్వర్యంలో డైరెక్టర్ మస్తాన్ షరీఫ్ డాక్టరేట్ డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ జి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది షరీఫ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ షేక్. మీరావలి మాట్లాడుతూ కృషి పట్టుదలకు డాక్టరేట్ ద్వారా అరుదైన గుర్తింపు దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ మస్తాన్ షరీఫ్ జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో, జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలను సమర్పి ంచారని ప్రతిభావంతులకు ఎల్లప్పుడూ మంచి ఫలితం దొరుకుతుందని కళాశాల సెక్రటరీ- కరస్పాండెంట్ షేక్. కరీమ్ మొహిద్దిన్ తెలిపారు. ఉరుకులు పరుగుల జీవితంలో కుటుంబానికి, కళాశాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూనే లక్ష్య సాధనకు క్రమశిక్షణతో సమయం కేటాయించి కష్టపడి గౌరవ డాక్టరేట్ సాధించడం పట్ల డాక్టర్ మస్తాన్ షరీఫ్ కృషికి నిదర్శనమని కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ తనను ప్రోత్సహించి లక్ష్య సాధనకు సహకరించిన కుటుంబ సభ్యులకు, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ అట్లూరి శ్యామ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఆంధ్రా యూనివర్సిటీలో ప్రముఖుల నుండి పట్టా అందుకుంటున్న డాక్టర్ మస్తాన్ షరీఫ్

టిడిపి కార్యకర్తలపై చర్య తీసుకోవాలి : అంబటి

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

తన పై అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టింగ్స్ పెట్టిన టిడిపి కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండు చేశారు. ఈ మేరకు గుంటూరు పట్టాభిపురం పోలీసులకి మంగళవారం అయన ఫిర్యాదు చేశారు. కూటమి సోషల్ మీడియా కార్యకర్తలు పెట్టిన అభ్యంతరకర పోస్ట్‌లను సాక్ష్యాధారాలతో సహా, పోలీసులకు సమర్పించారు. తాను మొత్తం ఐదు ఫిర్యాదులను చేసానని తెలిపారు. మాజీ సిఎం జగన్, తమ పార్టీ నాయకులపై టిడిపి కూటమి పార్టీల సోషల్ మీడియా కార్యకర్తలు పెడుతున్న అభ్యంతరకర పోస్టులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను కంట్రోల్ చేయలేక సోషల్ మీడియా యాక్టివిస్టులను భయభ్రాంతులకు గురి చేయాలనే ఉద్దేశ్యంతో మా కార్యకర్తలను కేసులతో వేధిస్తున్నారనీ అయన తెలిపారు. రిమాండ్ లో ఉండగా కస్టడీ లోకి తీసుకుని చిత్రహింసలకు గురి చేస్తున్నారనీ తెలిపారు. పేరుకేమో ఏ పార్టీ వారు పోస్టులు పెట్టినా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు పెద్ద పెద్ద మాటలు మాట్లాడు తున్నారనీ కానీ మేం ఎన్ని ఫిర్యాదులు చేస్తున్నా ఏఒక్కరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. సజ్జా అజయ్, స్వాతిరెడ్డి, గాయత్రి అనే వారు పోస్టు లు పెట్టారని సాక్ష్యాధారాలతో సహా, పోలీసులకు ఫిర్యాదు చేశామని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరామని అంబటి రాంబాబు వెల్లడించారు. అత్యంత హేయంగా పోస్ట్‌లు పెట్టి వేధింపులకి పాల్పడుతున్నారని చెప్పారు. తన పై అసభ్య పదజాలంతో పోస్టింగ్స్ పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలనీ మాజీ మంత్రి విడదల రజని ఫిర్యాదు చేసి 20 రోజులైనా ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు.



పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న అంబటి

గాలి నాణ్యత పెంచటానికి పటిష్ట చర్యలు : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలోని గాలిలో ధూళిశాతం గణనీయంగా తగ్గించి, నాణ్యతా ప్రమాణాల పెంపుదలకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి)లో నిర్దేశించిన కార్యక్ర మాలు సక్రమంగా అమలు జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి నగర కమిషనర్ పి.శ్రీనివాసులు, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాద్‌తో కలసి ఎన్‌సీఏపీ 2024-25 జిల్లాస్థాయి అమలు కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు గాలి కాలుష్య కారకాలు, గాలి నాణ్యతా ప్రమాణాలు, వివిధ శాఖలు యాక్షన్ ప్లాన్‌లో ప్రతిపాదించిన పనులు, మార్గదర్శకాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో గాలిలో గతంలో పీఎం 10 (పార్టికల్స్) నిర్దేశించిన స్థాయి 60 కంటే ఎక్కువగా ఉండటంతో నాన్ ఎటైన్మెంట్ సిటీగా సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించిందని, గాలి నాణ్యత పెంపుదల కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయించటం జరుగుతుందన్నారు. ప్రస్తుతం గుంటూరులోని గాలినాణ్యతా ప్రమాణాలు పీఎం 10 నిర్దేశించిన స్థాయిలోనే ఉందని, మరింతగా నాణ్యతను పెంపుదల చేయటానికి నగరంలో గాలి కాలుష్యం కాకుండా సంబంధిత శాఖలు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై దుమ్ము ధూళి లేకుండా ప్రతిరోజు శుభ్రం చేయటంతో పాటు, ప్రధాన రహదారులలో డ్రైయిన్ టూ డ్రైయిన్ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అన్ని ప్రాంతాల్లో పచ్చదనం పెంపుదల కోసం విరివిగా మొక్కలు పెంచాలన్నారు. స్థలాలు లభ్యత ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో మొక్కలు పెంచటానికి అటవీ శాఖను సమన్వయం చేసుకొని నగరవనాలు, నగర వాటికల ఏర్పాటుకు, అభివృద్ధికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణాల వలన దుమ్ము, ధూళి వ్యాప్తి చెందకుండా అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకునేలా భవన యజమానులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. వాహనాల కాలుష్యం తగ్గించేందుకు 15 సంవత్సరాలు దాటిన వాహనాలను తొలగించేలా, నిర్దేశిత స్థాయి కంటే ఎక్కువ కాలుష్యాన్ని ఉత్పత్తి చేసే వాహనాలపై చర్యలు తీసుకునేలా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సీఎన్జీ, ఈవీ వాహనాల వినియోగం ప్రోత్సహించేలా సీఎన్జీ, ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటుకు పౌర సరఫరాల అధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. క్వారీల వలన ధూళి రాకుండా, వ్యవసాయ పంట వ్యర్థాలు, మిర్చి తొడియలు దగ్ధం చేయకుండా సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షించి చర్యలు తీసుకో వాలన్నారు. నగరాల్లో గాలినాణ్యతా ప్రమా ణాలు పెంపుదలకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశించిన కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా అందించే నిధులతో సంబంధిత శాఖలు అవసరమైన కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. ఎన్‌సీఏపీ 2024-25 నిధులు రూ.2.73 కోట్ల అంచనా వ్యయంతో జిఎంసి రహదారుల అభివద్ధికి, రవాణా శాఖ వాహనాల పొల్యూషన్ తనిఖీ వాహనం కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ప్రాధమికంగా ఆమోదించారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎండీ నజీనా బేగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, అసిస్టెంట్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్, కమిషనర్

గుంటూరు నగరానికి ఐకాన్‌గా ఎన్టీఆర్ స్టేడియం

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియాన్ని దశలవారీగా అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో అభివృద్ధి పనులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం గుంటూరు నగరానికి ఐకాన్‌గా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, వివిధ క్రీడాంశాల్లో ఎందరో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసిన ఘనత స్టేడియానికి దక్కుతుంన్నారు. ఎంతో ప్రతిష్ట కల్గిన స్టేడియం తగిన విధంగా అభివృద్ధి చేయటంలో జరిగిందని, ప్రజా ప్రతినిధులు, వాకర్స్ ఆకాంక్షల మేరకు త్వరలో స్టేడియాన్ని సమగ్ర వసతులతో అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే స్టేడియంలో ఇండోర్ స్టేడియం సీలింగ్, శ్లాబ్ లీకులు, షటిల్ కోర్ట్, టెన్నిస్ కోర్ట్ మరమ్మతులు, లైట్లు జిమ్‌లో పరికరాల సమస్యలు, వాకింగ్‌ట్రాక్, మెయిన్ గేటు మరమ్మలు, స్విమ్మింగ్ పూల్‌లో ఫిల్టర్స్ రిపేరు, దుస్తులు మార్చుకునే గదుల ఏర్పాటు తదితర సమస్యలు గుర్తించామన్నారు. అలాగే కొన్ని క్రీడలకు అదనపు వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని, త్వరలో కమిటి ఏర్పాటుకు కూడా ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. స్టేడియం పరిసరాల్లో నూతనంగా నిర్మాణం చేసిన జిమ్ భవనం నిర్మాణ అనుమతులు, నిధుల వినియోగంపై విచారణ చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిగా ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలోనే స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చామని, త్వరలో నూతన కమిటీని ఎన్నిక చేసుకొని, కమిటి ఆధ్వరంలో అభివృద్ధి పనుల కార్యాచరణ చేపడతామన్నారు. స్టేడియంకు ప్రతి రోజు వాకింగ్, వివిధ క్రీడాంశాల కోసం 4 నుండి 6 వేల మంది వస్తుంటారన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, కార్పొరేటర్లు వి.శ్రీరామ్ ప్రసాద్, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

పన్ను చెల్లించకుంటే ట్యాప్ కనెక్షన్ తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించని వారి నివా సాలకు తొలుత ట్యాప్ కనెక్షన్‌లు తొలగిస్తామని, అప్పటికీ చెల్లించ కుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీని వాసులు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ ఆదేశాల మేరకు బృందావన్ గార్డెన్స్‌లోని గంటా పున్నయ్య చౌదరి 2019 నుండి నీటి పన్ను రూ.1,5,6,365 బకాయి చెల్లించనందుకు, సిపిటి రోడ్డులోని కొత్త కాలనిలో అనధికారికంగా ట్యాప్ కనెక్షన్ పొందిన నందిగామ కోటయ్య నివాసాలకు మున్సిపల్ ట్యాప్ కనెక్షన్‌ని ఇంజినీరింగ్ సిబ్బంది తొలగించారు.

ఆక్రమణల తొలగింపు పరిశీలన..

మంగళవారం కమిషనర్ కొరిటెపాడు సెంటర్ నుండి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు జిఎంసి చేపట్టిన డ్రైన్, రోడ్ ఆక్రమణల తొలగింపు ప్రక్రియను, గుజ్జనగుండ్ల పాలిటెక్నిక్ కాలేజీ దగ్గర వెండింగ్ జోన్ ఏర్పాటు మార్కింగ్‌లను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్‌కి అవరోధం కాకుండా, బండ్లు రోడ్ల మీదకు రాకుండా ఉండేలా మార్కింగ్ చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.

ప్రవేశ మార్గాల్లో లాన్‌లు ఏర్పాటు చేయాలి..

గుంటూరు నగరానికి వచ్చే ప్రధాన ప్రవేశ మార్గాల్లో పచ్చదనంతో కూడిన లాన్‌లు, డివైడర్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పార్క్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఆటో నగర్ రోడ్, వై జంక్షన్ ప్రాంతాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

12 మంది నోడల్ అధికారులకు షోకాజ్ నోటీసులు

ఎన్‌పిసిఐ సర్వే , జియో ట్యాగింగ్ పర్యవేక్షణ లోపంపై 12 మంది నోడల్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.